క్లుప్తంగా

రాముని అక్షతల పంపిణీ



అక్షతలు పంపిణీ చేస్తున్న నాయకులు

కాకినాడ రూరల్: అయోధ్య రాముని అక్షతలను బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. పార్టీ నాయకులు కవికొండల భీమశేఖర్, గౌతు చెన్నారావు ఆధ్వర్యంలో 48వ డివిజన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు వేటూకూరి సూర్యనారాయణరాజు, ముత్తా నవీన్‌కృష్ణ, రంబాల వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అయోధ్య రాముడి ఆలయం ప్రారంభోత్సవానికి సమయం ఆసన్నమైందన్నారు.

శుభకార్యాలకు వినియోగించాలి

బోట్‌క్లబ్: అయోధ్య బలరాముని అక్షతలు ఇంటింటికీ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు సీతాపతి, రాంబాబు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ సహకారంతో అయోధ్య శ్రీరామ తీర్థ క్షేత్రం నుంచి వచ్చిన అక్షతలను ఆదివారం స్థానిక వినుకొండ వారి వీధిలో పంపిణీ చేశారు. అక్షతలను 22వ తేదీ వరకు పవిత్రంగా ఉంచి, వాటిని ఏడాదంతా శుభకార్యాలకు వాడుకోవాలన్నారు.

20న శ్రీరామ నామ హోమం

బోట్‌క్లబ్: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ నిర్విఘ్నంగా కొనసాగాలంటూ 20వ తేదీన స్థానిక గొడారిగుంటలోని సత్యదేవ మందిర ప్రాంగణంలో లక్ష రామనామ జప హోమం నిర్వహిస్తున్నట్టు మందిర నిర్వాహకుడు పరశురామ్ తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను ఉత్తరాది మఠాధీశులు సత్యాత్మతీర్థ స్వామీజీ ఆదివారం రామారావుపేటలోని మధ్వసభలో ఆవిష్కరించారు. మధ్వపురోహితులు యాతగిరి మద్వేష్ ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, 11.30కు పూర్ణాహుతితో పూర్తవుతుందని పరశురామ్ వివరించారు.

స్క్వాష్ పోటీలకు రాష్ట్ర జట్టు పయనం

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పుణేలో ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగే పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17, 19 స్క్వాష్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు ఆదివారం పయనమైనట్టు సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఇటీవల కాకినాడ డీఎస్‌ఏలో జరిగిన ఎంపికల్లో 24 మందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ క్రీడాకారులకు కాకినాడలో డీవైఈఓ ఆర్జేడీ రాజు, హెచ్‌ఎం రంగారావు క్రీడా దుస్తులు అందజేశారు. పీడీలు మంగయమ్మ, డీఎస్‌ఏ కోచ్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల మానవహారం

కాకినాడ సిటీ: ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం, స్వతంత్ర సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం ఐదో రోజు కొనసాగింది. మున్సిపల్ వర్కర్స్ మహిళా ప్రతినిధి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. యూనియన్ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. మున్సిపల్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలంటూ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రదర్శన చేశారు. ముత్తా గోపాలకృష్ణ వారధి వద్ద మానవహారం నిర్వహించారు.

లక్ష్మీహయగ్రీవ అవతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారు లక్ష్మీహయగ్రీవ అవతారంలో భక్తులను దర్శనమిచ్చారు. స్వామి వారికి ఆలయ ప్రధానార్చకుడు భావవరపు భాస్కరాచార్యులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



కాకినాడ రూరల్ రమణయ్యపేటలో పింఛను ఇస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగుతోంది. మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. అనంతరం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెరిగిన పింఛను సొమ్ము రూ.3 వేల చొప్పున పంపిణీ చేపట్టారు.

ఎట్టకేలకు..

- కాకినాడ రోడ్డు అభివృద్ధి ప్రారంభం
- టీడీపీ నిర్వాకంతో అర్ధాంతరంగా ఆగిన పనులు
- భారీ వర్షాలకు ధ్వంసమైన వైనం
- ప్రయాణికుల క్షేమం దృష్ట్యా చక్కదిద్దుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



సామర్లకోట-కాకినాడ రోడ్డులో జరుగుతున్న పనులు

సామర్లకోట: భారీ వర్షాల కారణంగా కాకినాడ రోడ్డుకు తూట్లు పడ్డాయి. అడుగడుగునా గోతులు ఏర్పడడంతో రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో సామర్లకోట–కాకినాడ రోడ్డు పనులను శనివారం నుంచి చేపట్టింది.

గత తెలుగుదేశం ప్రభుత్వం నిర్వాకం కారణంగానే కాకినాడ రోడ్డు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు అభివృద్ధి చేయడానికి రూ.200 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా రోడ్డు మార్జిన్‌లో ఉన్న షాపులు, మందిరాలు, ఇళ్లను తొలగించి వారికి నష్ట పరిహారం కూడా చెల్లించారు. రోడ్డు మార్జిన్‌లో ఇళ్లు నిర్మించుకున్న వారికి మరో ప్రాంతంలో స్థలాలను కేటాయించారు. కాకినాడకు రోడ్డు మార్గం ఏర్పడినప్పటి నుంచి రహదారి విస్తరణకు నోచుకోవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. తదుపరి టీడీపీ అధికారంలోకి వచ్చాక కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదరకపోవడంతో, రోడ్డు అభివృద్ధి పనులు అమాంతం నిలిపివేశారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులకు తోడు భారీ వర్షాల కారణంగా రహదార్లు ధ్వంసమయ్యాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక.. అధ్వానంగా ఉన్న రోడ్ల దుస్థితిని గమనించిన పార్టీ శ్రేణులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా కలెక్టర్ కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ క్రమంలో రోడ్డు పనులు చేపట్టడానికి ప్రత్యేక నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో రోడ్డు అభివృద్ధి పనులు మొదలయ్యాయి. నూతన సంవత్సరంలో తెలుగువారి సంక్రాంతి పండగకు వాహనచోదకులు సుఖమయ, సురక్షిత ప్రయాణం చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఓవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి పనులు జోరుగా సాగడంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

నీరు నిలవకుండా నిర్మించాలి

ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్లకు కొంత కాలంలోనే తూట్లు పడుతున్నాయనే విమర్శలున్నాయి. రోడ్లకు ఇరువైపులా ఎత్తుగా మట్టి దిమ్మలు (బెర్మ్‌లు) పేరుకుపోవడంతో, భారీ వర్షాల సమయంలో రోడ్లపై నీరు నిలిచిపోతోంది. దీంతో తారు వదలి వేయడం, రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలు సాగించడంతో గోతులు ఏర్పడుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని నిర్మాణ సమయంలోనే సాంకేతికంగా రోడ్డు వాటంగా ఉంచడంతో పాటు, రోడ్డుపైకి చేరే నీరు సమీపంలోని గోదావరి కాలువ, మురుగు కాలువల్లోకి పోయేలా ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సామర్లకోట–పెద్దాపురం ఏడీబీ రోడ్డు నిర్మాణం వాలుగా చేయడం వల్ల వర్షపు నీరు రహదారిపై నిలిచే అవకాశం లేదు. ఈ కారణంగా పాతికేళ్లయినా ఆ రోడ్డు చెక్కుచెదర లేదని వారు చెబుతున్నారు. అదేవిధంగా రోడ్డు నిర్మించి, దాని జీవిత కాలం పెంచాలని ఆయా ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కెనాల్ రోడ్డు మార్జిన్‌లో పెరిగిపోయిన తుప్పలు

పాడైతే.. పూర్తిగా నిర్మిస్తున్నాం

ఈ రోడ్డులో పాడైన చోట్ల నిర్మాణం, మరమ్మతు పనులు చేస్తున్నాం. కాకినాడ–ద్వారపూడి కెనాల్ రోడ్డు మార్గంలో రూ.5.70 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టాం. చిన్న గోతులుంటే మరమ్మతులు చేస్తున్నాం, బాగా పాడైతే రోడ్డు పూర్తిగా నిర్మిస్తున్నాం.

– మంగాదేవి, జేఈ, ఆర్‌అండ్‌బీ, కాకినాడ

ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్తా



రోడ్డు మార్జిన్‌లో పెరిగిన మట్టి దిమ్మల కారణంగా వర్షపు నీరు నిలిచిపోతోంది. దీంతో భారీ వాహనాల రాకపోకలతో రోడ్లకు తూట్లు పడుతున్నాయి. గత కాంగ్రెస్ పాలనలో ధవళేశ్వరం నుంచి కాకినాడ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు కాగా, టీడీపీ అధికారంలోకి వచ్చాక పనులు ఆపేశారు. రోడ్డు మార్జిన్‌లో ఉన్న మట్టిదిమ్మలతో పాటు తుప్పలను తొలగించేలా ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. రోడ్డు మార్జిన్‌లో తుప్పలు పెరిగిపోవడం వల్ల వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– మేడిశెట్టి వీరభద్రం, మార్కెట్ కమిటీ చైర్మన్, మాధవపట్నం

స్ఫూర్తి ఉంటే ఏదైనా సాధ్యమే..

కాకినాడ ఎంపీ వంగా గీత



విజేతలను సత్కరిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, సంస్థ అధినేత శ్యామ్

బోట్‌క్లబ్: జీవితంలో స్ఫూర్తిగా తీసుకుంటే ఏదైనా సాధ్యమేనని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. ఎస్సై పరీక్షల్లో విజేతలుగా నిలిచిన శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అభ్యర్థులకు ఆదివారం ఆ సంస్థలో అభినందనసభ జరిపారు. ఎంపీ గీత మాట్లాడుతూ ప్రజలకు మేమున్నామంటూ భరోసా కల్పించే పోలీసులను తయారుచేసే ఫ్యాక్టరీ శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అన్నారు. మొత్తం 411 ఎస్సై ఉద్యోగాల్లో 343 సంస్థ అభ్యర్థులు సాధించడం చరిత్ర అన్నారు. ఉత్తమ శిక్షణతోనే స్టేట్ ఫస్ట్‌తో పాటు వరుస పది ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో 23 ఏళ్ల క్రితం శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైందని తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం సాధించిన వారు విధుల్లో మంచి అధికారిగా పేరు తెచ్చుకోవాలన్నారు. సంస్థ అధినేత గుంటూరు శ్యామ్ మాట్లాడుతూ నైపుణ్యమున్న అధ్యాపకుల శిక్షణతో 16 వేల ఉద్యోగాలు సాధించగలిగామన్నారు. త్వరలో శ్యామ్ జూనియర్ కళాశాల ప్రారంభిస్తున్నామన్నారు. అనంతరం స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ రామచంద్రారెడ్డికి రూ.5 లక్షలు, మహిళా ఫస్ట్‌ర్యాంకర్ వెంకటలక్ష్మికి రూ.3 లక్షలు నగదు అందించారు. హైదరాబాద్ పోలీసు ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ మధుకర్, సంస్థ డైరెక్టర్ శైలజ, సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు పాల్గొన్నారు.

మహిళలకు 9 నుంచి సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాలపై చర్చిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: మండలంలోని 23 గ్రామాల్లో ఈ నెల 9(మంగళవారం) నుంచి 11వ తేదీ వరకూ మహిళలకు జగనన్న సంక్రాంతి సంబరాలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు తెలిపారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సొంత ఖర్చుతో ఈ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు సమావేశమై, జగనన్న సంక్రాంతి సంబరాలపై చర్చించారు. ఎంఈఓ–1 కె.బుల్లికృష్ణవేణి పర్యవేక్షణలో రంగవల్లులు, స్పూన్‌అండ్‌లెమన్, మ్యూజికల్స్ చైర్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయాలన్నారు. 9న నడకుదురు, పెనుగుదురు, ఉప్పలంక, గురజనాపల్లి, కొరిపల్లి, జెడ్.భావారం, అరట్లకట్ట, గొడ్డటిపాలెం, పాతర్లగడ్డ గ్రామాల్లో, 10న వలసపాకల, వేములవాడ, వాకాడ, పెదకొత్తూరు, వేళంగి, కూరాడ, సిరిపురం గ్రామాల్లో, 11న కరప, గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, జి.భావారం, యండమూరు గ్రామాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు ఈశ్వరరావు వివరించారు.

సాధించుకున్న హక్కులను కాపాడుకోవాలి

కాకినాడ సిటీ: సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్‌ను పటిష్టంగా అమలు చేయాలని ఏపీ మెడికల్ అండ్ సేల్స్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (ఏపీఎంఎస్‌ఆర్‌యూ) కాకినాడ నగర బ్రాంచ్ 50వ వార్షిక జనరల్ బాడీ సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం సుందరయ్య భవన్‌లో సంఘ నాయకుడు కె.అప్పారావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సంఘ రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రటరీ సి.వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ సాధించుకున్న హక్కులను కాపాడుకోవాలన్నారు. కేంద్రం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకూ పోరాటం సాగుతుందన్నారు. సంఘ బ్రాంచ్ కార్యదర్శి ఏఆర్‌సీ వర్మ ప్రవేశపెట్టిన నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం అధ్యక్షుడిగా ఎంఎ స్వామి, కార్యదర్శిగా సత్యశ్రీనివాస్, కోశాధికారిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా దీక్షిత్, వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా వర్మ, శ్యామ్, కమిటీ సభ్యులుగా సుబ్రహ్మణ్యం, అశోక్, కిశోర్, హుస్సేన్, సతీష్, షంషుద్దీన్, దుర్గాప్రసాద్, ఆదినారాయణ, నరేష్, అప్పారావు, ప్రసాద్, అయ్యప్ప, శేఖర్‌తో పాటు 24 మందిని నూతన కమిటీగా ఎన్నుకున్నారు.

ఖిద్మత్ కమిటీ సేవలు ఆదర్శనీయం



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఖిద్మత్ కమిటీ సభ్యులు

కాకినాడ సిటీ: నగరంలో కాకినాడ ఖిద్మత్ కమిటీ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ ఐదు జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి అబ్దుల్ బషీరుద్దీన్ అన్నారు. కాకినాడ ఖిద్మత్ కమిటీ ఆధ్వర్యంలో.. నగరంలోని బస్ షెల్టర్లు, ఫుట్‌పాత్‌లపై నిద్రించే నిరాశ్రయులకు దాతల సహకారంతో దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బషీరుద్దీన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కమిటీ కార్యదర్శి షేక్ హుస్సేన్ మాట్లాడుతూ గత వారం 30 మందికి దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. తమ సేవా కార్యక్రమాలను తెలుసుకున్న దుబాయిలోని బహద్దుర్‌షా అనే దాత సహకారంతో రెండోసారి దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. నగరంలోని జగన్నాథపురం, దేవాలయం వీధి, జీజీహెచ్, జెడ్పీ సెంటర్, బాలాజీ చెరువు సెంటర్‌లో వీటిని పంపిణీ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు హసన్ షరీఫ్, మౌలానా పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కిర్లంపూడి: విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైనట్టు జగ్గంపేట ఫైర్ ఆఫీసర్ లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. సామర్లకోట మండలం పెద్దబ్రహ్మదేవం గ్రామానికి చెందిన రామరాజు ట్రాక్టర్‌పై గడ్డి తరలిస్తుండగా, కిర్లంపూడి మండలం సోమవరం వంతెన వద్ద విద్యుత్ తీగలు తలిగి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న జగ్గంపేట అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం జరిగినట్టు లక్ష్మణరావు తెలిపారు.

కిటకిటలాడిన సాగర తీరం



పర్యాటకులతో కిటకిటలాడిన సాగరతీరం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ సాగర తీరం ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ ఉన్న తీర ప్రాంతంలో పర్యాటకులు ఆటపాటలతో సందడి చేశారు. ప్రధానంగా ఉప్పాడ తీరానికి జిల్లా నలుమూలల నుంచి నిత్యం పర్యాటకులు వస్తున్నారు. రోజురోజుకీ పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నా అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

- సీపోర్ట్సు సీఓఓ మురళీధర్
- 51 మందికి రూ.10.20 లక్షల స్కాలర్‌షిప్‌ల పంపిణీ



సీపోర్ట్సు సీఓఓ మురళీధర్ దంపతులను సత్కరిస్తున్న కమ్మ మహాజన సంఘ ప్రతినిధులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకుని విద్యార్థినీ విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని కాకినాడ సీపోర్ట్సు సీఓఓ ఎం.మురళీధర్ అన్నారు. ఆదివారం కమ్మ కల్యాణ మండపంలో కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన వివిధ కులాల విద్యార్థినీవిద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. సభకు అధ్యక్షత వహించిన శ్రీచారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చంద్రు గోవిందరాజు మాట్లాడుతూ ట్రస్ట్ తరఫున ఏటా ఇంజినీరింగ్, మెడికల్, ఫార్మసీ, పీజీ చదువుతున్న పేద విద్యార్థులకు నగదు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది 51 మందికి రూ.10.20 లక్షల స్కాలర్‌షిప్‌లు అందించామని తెలిపారు. ముఖ్యఅతిథి సీఓఓ మురళీధర్ మాట్లాడుతూ తాను ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో ఈ ట్రస్ట్ తరఫున తన స్నేహితులు రూ.320 స్కాలర్‌షిప్ అందుకున్నారని, వారు ఇప్పుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారని వివరించారు. ఉపకార వేతనం అందుకున్న విద్యార్థులు బాగా చదువుకుని, నలుగురికి సాయం చేసేలా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా మురళీధర్, గోవిందరాజు, కల్యాణ్‌లు విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. అనంతరం మురళీధర్, కృష్ణవేణి దంపతులను కమ్మ మహాజన సంఘం తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ట్రస్టీ గారపాటి కల్యాణ్, ప్రతినిధులు జీవీఎస్టీ రాయుడు, వెంకట్రావు, రావిపాటి రామారాయ చౌదరి, జాస్తి మూర్తి, రవీంద్రనాథ్ చౌదరి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పండిత పరిషత్ జిల్లా కార్యవర్గం నియామకం



పండిత పరిషత్ జిల్లా కార్యవర్గ సభ్యులు

కొత్తపల్లి: కాకినాడ జిల్లా పండిత పరిషత్ జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు గిరిరాజు, ప్రధాన కార్యదర్శి రవిచంద్రల నేతృత్వంలో ఆదివారం నియమించారు. గౌరవ అధ్యక్షుడిగా తామరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న దాడి చంద్రశేఖరరావు, అధ్యక్షుడిగా ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పెద్దబ్బాయి, ప్రధాన కార్యదర్శిగా కాట్రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న కె.సురేఖ, ట్రెజరర్‌గా చినజగ్గంపేట ఎంపీయూపీ పాఠశాలలో పనిచేస్తున్న ప్రమీల, సంయుక్త కార్యదర్శిగా హంసవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రమణ, ఉపాధ్యక్షులుగా వన్నెపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నీలకంఠ శర్మ, మాధవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా ఏలేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మహర్షిలను నియమించారన్నారు.

సత్యదేవుని దర్శించిన కేరళ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్



రత్నగిరిపై జస్టిస్ మంజులకు స్వాగతం పలికిన అధికారులు, పండితులు

తొండంగి: కేరళ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ చెల్లూరు మంజుల ఆదివారం కుటుంబ సమేతంగా అన్నవరంలో రత్నగిరిపై సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి వ్రతమాచరించారు. ఆలయం వద్ద ఆమెకు పండితులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేయగా సత్యదేవుని చిత్రపటం ప్రసాదాన్ని దేవస్థాన అధికారులు అందజేశారు.

సత్యదేవుని దర్శించిన శ్రీశైలం దేవస్థానం ఈఓ

శ్రీశైలం మల్లికార్జునస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి గాదిరాజు పెద్ది రాజు ఆదివారం అన్నవరంలో రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అధికారులు ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం పండితులు సత్యదేవుని చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ముగిసిన ఆర్‌ఎంసీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ గీత, చిత్రంలో ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, రామ్‌కోశా బృందం

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో రెండు రోజులు పాటు కొనసాగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం రాత్రి ముగిసింది. ధూం ధాం రంగరాయన్ అన్న స్థాయిలో 50 ఏళ్ల పైబడి వైద్య సేవల అనుభవం ఉన్న వందలాది మంది వైద్యులు వివిధ వేషధారణలు, ఆటపాటలతో అలరించారు. శని, ఆదివారాల్లో జరిగిన ఈ భారీ సమ్మేళనానికి అతిథులుగా వచ్చిన వారి స్ఫూర్తిదాయక సందేశాలు ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. రామ్‌కోశా అధ్యక్షుడు డాక్టర్ వాడ్రేవు రవి, కార్యదర్శి కల్యాణ్ చక్రవర్తి, కోశాధికారి డాక్టర్ చిట్ల కిరణ్‌కుమార్, వారి బృందం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రామ్‌కోశా కార్యవర్గ ఎన్నికలో అధ్యక్షుడుగా సేఫ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ ఎంవీ ఆనంద్, కార్యదర్శిగా అహోబిల ఆస్పత్రి అధినేత డాక్టర్ ఆదిత్య సత్య ప్రసన్న, కోశాధికారిగా ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ తేజోకృష్ణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

ఇంటికి నిప్పు పెట్టేందుకు విఫలయత్నం

కాకినాడ రూరల్: కోళ్ల కోసం వచ్చిన గొడవ కాస్తా.. ఎదురింట్లో ఉన్నవారిపై హత్యాయత్నానికి దారి తీసింది. ఇంటి గుమ్మంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టేందుకు ఓ వ్యక్తి విఫలయత్నం చేశాడు. అదృష్టవశాత్తు నిప్పంటుకోకపోవడంతో.. ఆ ఇంట్లో ఉన్న నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని కాకినాడ మండలం తూరంగి శివకృష్ణ కాలనీలో ఆదివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. యర్రా రమణ కుటుంబం ప్రాణాలతో బయటపడింది. మద్యం మత్తులో ఉన్న గరగ సాయి అనే వ్యక్తి కోళ్ల కోసం వచ్చిన గొడవను నెపంగా చూపి, కవర్‌లో తెచ్చిన పెట్రోలును యర్రా రమణ ఇంటి గుమ్మంపై పోశాడు. అగ్గిపుల్లను వెలిగించే ప్రయత్నం చేయగా రాజుకోలేదు. ఒకవేళ అగ్గిపుల్ల వెలిగి ఉంటే, మంటలు వ్యాపించి.. ఇంట్లో వారికి ప్రాణహాని, తీవ్ర నష్టం జరిగి ఉండేది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇంద్రపాలెం స్టేషన్ హౌస్ ఆఫీసరు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శంఖవరం హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

శంఖవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1982–83 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 40 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో ఈగల సత్తిబాబు, నడిగట్ల నానాజీ తదితరులు పాల్గొన్నారు.